# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 85 | పేజీలు: 4 | వెల: 4/- | గురువారం • 17, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## తెలంగాణ రాష్ట్ర విద్యా మండలి చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్ర విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అలాగే వైఎస్ చైర్మన్ గా ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తమ్ ను నియమించింది. వీరు ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ప్రస్తుతం నల్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్నారు.



## కాశ్మీర్‌లో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

- సీఎంగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణం
- కేబినేట్‌లోకి ఐదుగురు మంత్రులకు చోటు
- ఓ మహిళా మంత్రికి అవకాశం ఇచ్చిన సీఎం
- ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలని డిజిపికి సీఎం ఆదేశాలు
- సీఎం పదవి ముళ్ల కిరీటం లాంటిదన్న ఫరూక్ అబ్దుల్లా

**శ్రీనగర్,అక్టోబర్16(నమస్తే ఉదయం):** జమ్మూ కశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆయనతో ప్రమాణం చేయించారు. బుధవారం ఉదయం 11.30 గంటలకు శ్రీనగర్‌లోని షెరి కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఒమర్ ప్రమాణస్వీకారం చేశారు. ఐదుగురిని తన క్యాబినెట్‌లోకి తీసుకున్నారు. వీరిలో నేషనల్ కాన్ఫరెన్స్ నుంచి నలుగురు, ఒక స్వతంత్ర అభ్యర్థి ఉన్నారు. ఎన్‌సీతో కూటమిగా ఎన్నికల్లో పోటీ చేసిన కాంగ్రెస్ పార్టీ నూతన ప్రభుత్వంలో చేరడం లేదని, బయట నుంచి మద్దతిస్తామని తెలిపింది. శ్రీనగర్‌లోని షేర్-ఇ-కశ్మీర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ సెంటర్‌లో జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీలు హాజరయ్యారు. వీరితో పాటు ఇండియా కూటమికి చెందిన ఇతర నేతలు వచ్చారు. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేసి, కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటించిన తర్వాత ఏర్పాటైన తొలి ప్రభుత్వం ఇది. ఈ ప్రభుత్వానికి కాంగ్రెస్ వెలుపలి నుంచి మద్దతు ప్రకటించింది. ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణస్వీకారం చేసిన కొద్ది సేపటికే పోలీసులకు తొలి ఆదేశాలిచ్చారు. వీఐపీల పర్యటన సమయంలో రోడ్లపై ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, లాఠీలు చూపించడం, దురుసుగా ప్రవర్తించడం చేయరాదని ఆదేశించారు. సీఎంగా తన రాకపోకల కోసం గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక పోస్ట్ చేశారు.

మిగతా.. 2లో



## 80 వేల కోట్ల అప్పు ఎక్కడికి పోయింది?

- మూసీ సుందరీకరణకు రూ.లక్షా 50 వేల కోట్లు ఎందుకు?
- ఒక్క కొత్త ప్రాజెక్ట్ కూడా చేపట్టలేదు
- మరి అంత డబ్బు ఎక్కడికి పోయింది?
- మీ ముఖ్యమంత్రే దివాళాకోరు మాటలు మాట్లాడితే అప్పులు ఎలా పుడుతాయి?
- తెలంగాణ భవన్‌లో నగర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో మూసీ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం

**హైదరాబాద్,అక్టోబర్16(నమస్తే ఉదయం):** ప్రభుత్వ ఆనాలోచిత నిర్ణయాల కారణంగా హైదరాబాద్‌లో పేదలు, దిగువ మధ్యతరగతి ప్రజలు, సామాన్యులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రభుత్వం అనాలోచితంగా, ప్రణాళిక లేకుండా పేదలకు ఎవరూ అండగా లేరన్నట్లుగా దూకుడుగా వారి మీదకు వెళ్తోంది.

మోదీ నోట్ల రద్దు చేసినప్పుడు ఏ విధంగా రకరకాల కారణాలు మారుస్తూ చెప్పారో, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పద్ధతి అవలంభిస్తోంది. ఒక రోజు మూసీ సుందరీకరణ అంటారు. ఒక రోజు నల్గొండకు నీళ్లు అంటారు. ఒక రోజు రూ. లక్షా 50 వేల కోట్లు ఎక్కడివి అంటారు. ఒక రోజు డీపీఆర్ లేనే లేదంటారు. ఒక ప్రణాళిక, ఆలోచన లేకుండా ముందుకు వెళ్తున్నారు. ప్రభుత్వమే 50 ఏళ్ల క్రితమే పర్మిషన్లు ఇచ్చి, ఇప్పుడు వాటిని కూలగొడతామని దుందుడుకుగా పోతామంటే కుదరదు. హైడ్రా, మూసీ ప్రాజెక్ట్ విషయంలో ఒక భయానక వాతావారణాన్ని సృష్టించారు. హైడ్రాను పెద్ద, పెద్ద బిల్డర్లను బెదిరించేందుకే ఉపయోగిస్తున్నారని మేము నమ్ముతున్నాం. మూసీ పేరిట ఏ విధంగా లూటీ చేస్తున్నారో ప్రజల దృష్టికి తీసుకెళ్తాం.

మూసీ కి సంబంధించి 100 శాతం మురుగు నీటి శుద్ధి ప్లాంట్లను మేము రూ. 4 వేల కోట్లతో నిర్మించాం. మూసీ శుద్ధి మేము చేశాం. దీంతో ఇక నల్గొండ జిల్లాకు వెళ్లే నీళ్లన్ని శుద్ధి చేసిన నీళ్లే వెళ్తాయి. దాని కోసం కొత్తగా ఖర్చు చేయాల్సిన పని లేదు. కొండపోచమ్మ సాగర్ నుంచి గండిపేట్‌కు నీళ్లు తెచ్చేందుకు 11 వందల కోట్లు ఖర్చు చేయాలని మేము

మిగతా.. 2లో

## నిరంతర సాధనతోనే నేరాల ఛేదన

- ఆధునికి సాంకేతికతను ఉపయోగించాలి
- పోలీస్ డ్యూటీ మీట్‌లో డీజీపీ జితేందర్

**హైదరాబాద్,అక్టోబర్16(నమస్తే ఉదయం):** నిరంతరం నేర్చుకుంటూ, తప్పులు సరిదిద్దుకుంటూ, జాగ్రత్తలు పాటిస్తేనే నేరాల ఛేదన సాధ్యమవుతుందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించాలని అన్నారు. రాజేంద్రనగర్‌లోని పోలీసు అకాడమిలో తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మొదటి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో మొదటి పోలీసు డ్యూటీ మీట్‌లో పాల్గొనడం సంతోషంగా




ఉందన్నారు. ఈ కార్యక్రమం పోలీసుల్లో బృంద స్ఫూర్తిని పెంచుతుందని తెలిపారు.

అన్ని కేసులను సాంకేతిక ఆధారాలతో ఛేదించాలని సూచించారు. న్యాయం జరిగితేనే బాధితులకు పోలీసు వ్యవస్థపై నమ్మకం వస్తుందని చెప్పారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు శక్తి వంచన లేకుండా పని చేయాలన్నారు. పోలీసు డ్యూటీ మీట్ ప్రారంభోత్స వానికి ముఖ్యఅతిథిగా సీఎస్ శాంతి కుమారి హాజరయ్యారు. నేటి నుంచి 19వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన 400 మంది పోలీసులు పాల్గొన్నారు. దైనందిన డ్యూటీలో భాగంగా కేసుల విచారణలు, మెలకువలపై ఇక్కడ పోటీలు ఏర్పాటు చేశారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవేర్‌నెస్ తదితరాలపై పోటీలు న్నాయి. కేసుల ఛేదన, ఆధారాల సేకరణపై ఉన్నతాధికారులు సూచనలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మహేశ్ భగవత్, శిఖా గోయల్ సహా పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

- రబీ సీజన్‌లో పంటల కనీస మద్దతు ధర పెంపు
- కేంద్ర మంత్రివర్గ సమావేశంలో కీలక నిర్ణయాలు

**న్యూఢిల్లీ,అక్టోబర్16(నమస్తే ఉదయం):** మోడీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక ప్రకటనలు చేశారు. ఒకవైపు కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు కానుకగా ఇస్తూనే మరోవైపు రైతులకు కూడా ప్రభుత్వం భారీ దీపావళి కానుకగా ఇచ్చింది. వాస్తవానికి రబీ సీజన్‌లో పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ని కేంద్రం పెంచింది. ఇందులో గోధుమ పంటకు క్వింటాల్‌కు రూ.150, ఆవాల పంటపై క్వింటాల్‌కు రూ.300 చొప్పున పెంచారు.రైతులకు దీపావళి కానుకగా రావి పంటల ఎంఎస్‌పిని కూడా పెంచాలని మంత్రివర్గ

మిగతా.. 2లో

## హైకోర్టులోనూ ఐఏఎస్‌లకు చుక్కెదురు

- కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాల్సిందే
- సొంత రాష్ట్రాల్లోనే రిపోర్ట్ చేయాలి
- ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీ

**హైదరాబాద్,అక్టోబర్16(నమస్తే ఉదయం):** అనుకున్నదే అయ్యింది. తెలంగాణలోనే పనిచేస్తామంటూ పట్టుబట్టిన ఆ నలుగురు ఐఏఎస్ అధికారులకు హైకోర్టు ఊహించని సూచనలు అందజేసింది. వెంటనే కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు



జారీ చేసింది. తెలంగాణలో పనిచేస్తున్న ఏపీ క్యాడర్ ఐఏఎస్‌లు క్యాట్ ఆదేశాలపై హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్


మిగతా.. 2లో

## జస్టిన్ ట్రూడో కారణంగా భారత్ - కెనడా మధ్య ఉద్రిక్తతలు

- రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు
- తదుపరి చర్యలు తీసుకోవడానికి స్వేచ్ఛ ఉంది
- భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడి

**న్యూఢిల్లీ,అక్టోబర్16(నమస్తే ఉదయం):** కెనడా-భారత్ మధ్య ఇటీవలి పరిణామాల తర్వాత, రెండు దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు త్వరలో ముగిసేలా కనిపించడం లేదు. ఈ అంశంపై తదుపరి చర్యలు తీసుకోవడానికి స్వేచ్ఛ ఉందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. మరోవైపు, కెనడా నుంచి ప్రస్తుతం సంబంధాలు ఏ దిశలోనైనా ముందుకు సాగవచ్చనే

మిగతా.. 2లో



## అప్పుల వారసత్వానికి ఆద్యులు ఎవరు?

- మీ హయాంలో అక్షరాలా రూ.7 లక్షల కోట్ల అప్పులు
- మంత్రి కేటీఆర్ ఆరోపణలకు మంత్రి సీతక్క కౌంటర్



**హైదరాబాద్,అక్టోబర్16 (నమస్తే ఉదయం):** పదేళ్ల పాలనలో లక్షల కోట్ల అప్పులు చేశారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్టుల పేరుతో అందినకాడికి అప్పులు తీసుకున్నారు. ఈ లెక్కలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బయట పెట్టింది. అసెంబ్లీ సాక్షిగా అన్ని వివరాలను ప్రజల ముందు ఉంచింది. అధిక అప్పుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎలా ఉందో కూడా వివరించింది. అయినా కూడా తాము మ్యానేజ్ చేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేస్తామని స్పష్టం చేసింది.

మిగతా.. 2లో

## హైడ్రాకు మరిన్ని అధికారులు

- జీహెచ్‌ఎంసి చట్టంలోని పలు అధికారాలు బదిలీ
- అక్రమ నిర్మాణాలు, అనధికారిక కట్టడాలకు ఇక నోటీసులు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్16(నమస్తే ఉదయం):** మహా నగరంలో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు, అనధికారిక కట్టడాలకు సంబంధించి హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని కమిషనర్ రంగనాథ్ తెలిపారు.




అనధికారిక భవనాల కూల్చివేత అధికారం కూడా హైడ్రాకు లభించిందన్నారు. నగరంలో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన హైడ్రాకు జీహెచ్‌ఎంసీ

మిగతా.. 2లో

## దేశవ్యాప్తంగా 9 మంది వీఐపీలకు ఎన్‌ఎస్‌జీ సెక్యూరిటీ తొలగింపు

- కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు

**న్యూఢిల్లీ,అక్టోబర్16(నమస్తే ఉదయం):** హైరిస్క్ జాబితాలో ఉన్న 9 మంది వీఐపీలకు నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్(ఎన్ఎస్‌జీ) కమాండోలను విత్ డ్రా చేసుకుని వారి స్థానంలో సీఆర్‌పీఎఫ్ కమాండోలకు బాధ్యతలు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించినట్లు అధికారిక వర్గాలు బుధవారం తెలిపాయి. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బందితో కూడిన తాజా బెటాలియన్‌ను కూడా



మిగతా.. 2లో



## టెక్నాలజీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

- స్టెరిలైట్ కంపెనీతో టీ ఫైబర్ ఎంవోయు
- వందలాది మంది యువతకు శిక్షణకు అవకాశం
- మొబైల్ కాంగ్రెస్‌కు హాజరైన మంత్రి శ్రీధర్ బాబు

**న్యూఢిల్లీ,అక్టోబర్16(నమస్తే ఉదయం):** స్టెరిలైట్ కంపెనీతో టీ ఫైబర్ ఎంవోయు కుదుర్చుకుందని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. దీని వల్ల వందలాది మంది యువత శిక్షణ పొందబోతున్నారని తెలిపారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు.. టెలికాం రంగంలో ఉపాధి లభిస్తుందని చెప్పారు. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఆసియాలోనే బిగ్గెస్ట్ టెక్ ఇవెంట్ ఇండియా మొబైల్ కాంగ్రెస్ -2024 సదస్సును మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సదస్సుకు 10 మంది ప్రతినిధుల బృందంతో తెలంగాణ ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు హాజరయ్యారు. అలాగే ఈ సదస్సుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ క్యాపిటల్ పార్ట్‌నర్‌గా తెలంగాణ రాష్ట్రం వ్యవహరిస్తుంది. ఈ సదస్సుకు హాజరైన ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు బుధవారం మాట్లాడుతూ... టెక్నాలజీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని తెలిపారు.

ఆ క్రమంలో అనేక టెలికాం సంస్థల ప్రతినిధులతో తాము సమావేశమై చర్చించామన్నారు. కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా.. ప్రత్యేకంగా టెలికామ్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీని రాష్ట్రాలు నిర్ణయం చేయవచ్చంటూ తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ టెలికాం మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ తెలియ జేయడం జరిగిందని చెప్పారు. మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం ప్రో యాక్టివ్‌గా తీసుకొని.. విధానపర నిర్ణయం తీసుకొని పాలసీని ఇనిషియేట్ చేస్తామన్నారు. దీనివల్ల అనేక టెలికాం మ్యానుఫ్యాక్చరర్స్ తెలంగాణకు వచ్చే అవకాశం

మిగతా.. 2లో

# కాశ్మీర్‌లో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

**(మొదటి పేజీ తరువాయి)**

జమ్మూకశ్మీర్ డీజీపీతో ఫోనులో మాట్లాడాను. వీఐపీల రాకపోకల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలకరాదని చెప్పాను. లాఠీలు ఝుళిపించడం, దురుసుగా ప్రవర్తించడం చేయవద్దని ఆదేశాలిచ్చాను. మన ప్రవర్తన పీపీల్స్-ఫ్రెండ్లీగా ఉండాలని నా మంత్రివర్గ సహచరులకు కూడా సూచించాను. ప్రజాసేవ కోసమే పదవుల్లో ఉన్నాం, వారికి అసౌకర్యం కలిగించడానికి కాదని చెప్పాను అని ఒమర్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ప్రమాణం చేసిన మంత్రుల్లో ఒకే ఒక్క మహిళ ఉన్నారు. ఆమే సకీనా ఈటూ సకీనా.. దక్షిణ కశ్మీర్‌కు చెందిన కుల్గామ్ జిల్లాలోని డీహెజ్ పోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. ఆమె పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి గుల్జార్ అహ్మద్ దర్‌పై 17,449 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ప్రముఖ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె నేషనల్ కాన్ఫరెన్స్‌లో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆమె తండ్రి వలీ మోహమ్మద్ ఈటూ.. ఈ పార్టీలో కీలకంగా వ్యవహరించారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. ఆయన 1994లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత తండ్రి వారసత్వాన్ని అందుకొని ముందుకు సాగుతోన్న ఆమె సోదరుడిని 2001లో ఉగ్రవాదులు బలిగొన్నారు. అప్పుడు ఆమె వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. తండ్రి, సోదరుడి మరణాలతో వెనకడుగు వేయని ఆమె రాజకీయ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ఆమెపై కూడా 20 సార్లకు పైగా హత్యాయత్నాలు జరిగాయి.

వాటన్నింటిని దాటుకొని.. జమ్మూకశ్మీర్ ప్రభుత్వంలో వివిధ హోదాల్లో పనిచేశారు. లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో



ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. పర్యాటక శాఖ, విద్యాశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు సామాజిక సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. 53 ఏళ్ల వయసులో తాజాగా కేబినెట్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. జమ్మూకశ్మీర్‌లో ప్రజాదరణ ఉన్న అతి కొద్దిమంది మహిళా నేతల్లో ఈమె ఒకరు. సామాజిక సంక్షేమం, మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందారు. జమ్మూలోని నౌషేరా నుంచి ఎన్నికైన సురిందర్ చౌధరీ డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. జమ్మూ ప్రాంతం ప్రజల గళాన్ని వినిపించేందుకు ఆయన్ను ఈ పదవికి ఎంపిక చేసినట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా వెల్లడించారు. ఈ ప్రభుత్వంలో తమకు ప్రాతినిధ్యం వహించేవారు లేరని జమ్మూ ప్రజలు బాధపడాల్సిన పనిలేదు. ఆ ప్రాంతం నుంచి ఉపముఖ్యమంత్రిని ఎంపిక చేశాను. దీంతో ఈ ప్రభుత్వం తమదని స్థానిక ప్రజలు భావిస్తారని సీఎం అన్నారు. అయితే.. ఈ కార్యక్రమం అనంతరం ఆయన తండ్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సీఎం బాధ్యత ముళ్ల కిరీటం లాంటిదని.. ప్రజల ఆశలను నెరవేర్చడంలో దేవుడు తన తనయుడికి అండగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రం ముందు ఎన్నో సవాళ్లు ఉన్నాయి. ఈ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చుతుందని నేను నమ్ముతున్నాను అని ఫరూక్ అబ్దుల్లా అన్నారు. కొత్త ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత రాష్ట్ర హోదా పునరుద్ధరణ అని ఒమర్ అబ్దుల్లా కుమారుడు జహీర్ అబ్దుల్లా పేర్కొన్నారు.

# టెక్నాలజీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

**(మొదటి పేజీ తరువాయి)**

ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అతి త్వరలో దీనిని తీసుకొచ్చే కార్యక్రమం తీసుకుంటామన్నారు. ఐటీ శాఖల మంత్రి జ్యోతిరాధిత్య సిందియా, పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఐటీ మినిస్టర్ల కాన్ఫరెన్స్‌లో తాము పాల్గొన్నట్లు తెలిపారు. ప్రభుత్వం తరఫున టీ ఫైబర్, ఆప్టికల్ ఫైబర్, నెట్‌వర్క్‌కు సంబంధించి గ్రామంలోని ప్రతి ఇంటికి నెట్‌వర్క్ సదుపాయం కల్పించేందుకు చేస్తున్న ప్రయత్నాన్ని ఈ సందర్భంగా వారికి వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. 2014 అనంతరం భారత నెట్ అని ఫేస్ టు ఫేస్ వన్ అని కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందని వివరించారు. రూ. 3 వేల కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయింపు చేసుకొని అండర్ గ్రౌండ్‌లో ఫైబర్, నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒడర్ గ్రౌండ్ నెట్‌వర్క్ ఏర్పాటు చేయడం తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకత అని ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు వివరించారు.

ఈ నెట్‌వర్క్ పూర్తి స్థాయిలో పూర్తి కావాలంటే నిధులు అవసరమన్నారు. ఆ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న ఇబ్బందులను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్ళామని చెప్పారు. దాదాపు రూ. 1600 కోట్లకు పైగా నిధులు అవసరమని.. వాటిని తెలంగాణాకు కేటాయించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. తంలో కేంద్ర ప్రభుత్వ దృష్టికి సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని తీసుకు వెళ్లారని గుర్తు చేశారు. అటవీ ప్రాంతాలకు సంబంధించి ÷బైర్ నెట్‌వర్క్ కోసం అటవీ శాఖా అనుమతులు రావాల్సి ఉందన్నారు. ఈ అనుమతుల అంశాన్ని కేంద్రం పరిష్కారం చేయాలని తాము కేంద్రాన్ని కోరామన్నారు. దీనిపై కేంద్రం సైతం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. మూడు రోజుల పాటు జరుగుతున్న ఈ సదస్సుకు 190 దేశాల ప్రతినిధులు, 3 వేల మంది పారిశ్రామికవేత్తలు, 400 మందికి పైగా ఎగ్జిబిటర్లు హాజరయ్యారు. అలాగే తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు దాదాపు 900 స్టార్టప్ కంపెనీలు 120 దేశాల నుంచి తరలి వచ్చాయి. ఈ సదస్సులో తెలంగాణ ప్రభుత్వం భాగస్వామిగా వ్యవహరిస్తుంది.

# జస్టిన్ ట్రూడో కారణంగా భారత్ - కెనడా మధ్య ఉద్రిక్తతలు

(మొదటి పేజీ తరువాయి)

సంకేతాలు అందాయి. కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో తండ్రి పిరె ఇలియట్ ట్రూడో కూడా గతంలో కెనడా ప్రధానిగా ఖలిస్థాన్ ఉగ్రవాదులకు ఊతమిచ్చారు. 300కుపైగా భారతీయ ప్రయాణికులతో కూడిన కనిష్క విమానాన్ని పేల్చటానికి ఉగ్రవాదులకు పరోక్షంగా దోహదం చేశారు. భారత్‌తో ఘర్షణాత్మక వైఖరి ప్రదర్శించారు. ఇప్పుడు ట్రూడో కూడా అదే బాటలో నడుస్తున్నారు. భారత్‌పై ఆర్థిక ఆంక్షలకు సంబంధించి కెనడా విదేశాంగ మంత్రి మిలోనీ జోలీ మాట్లాడుతూ.. అంతా టేబుల్‌పైనే ఉందని.. అంటే కెనడా తన వైఖరిని భారత్ ముందు తెరిచి పెట్టిందని అన్నారు. మరోవైపు విదేశీ వ్యవహారాల నిపుణుడు రాజీవ్ డోగ్రా స్పందిస్తూ.. "కెనడాతో మా వాణిజ్య సంబంధాలు చాలా పెద్ద భూభాగంలో లేవని, కెనడా ఆర్థిక ఆంక్షలు విధించినప్పటికీ, కెనడా ఎగుమతిదారులకు భారతదేశం కంటే ఎక్కువ నష్టం కలిగిస్తుంది." అని సమాధానమిచ్చారు. ట్రూడో ప్రభుత్వం భారత్‌పై ఎలాంటి ఆర్థిక ఆంక్షలు విధించాలని ప్రయత్నిస్తే, దాని పరిధి జీ7కి చేరుతుందని విదేశీ వ్యవహారాల నిపుణుడు ప్రొఫెసర్ స్వరణ్ సింగ్ చెబుతున్నప్పటికీ, ప్రధాని మోడీని ఈ బృందంలో చేర్చిన విధానం వల్ల అది సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. సమ్మిట్‌లతో పాటు ఆహ్వానించడం వల్ల కెనడాకు ఏ భాగస్వామ్య దేశం మద్దతు ఉన్నట్లు అనిపించడం లేదు. ఆంక్షలు విధిస్తే అది కెనడా-భారత్ వాణిజ్య సంబంధాలకే పరిమితం అవుతుందని దీన్ని బట్టి స్పష్టమవుతోంది. తదుపరి వ్యూహంలో భాగంగా కెనడా అక్కడ విద్యనభ్యసించే విద్యార్థుల సంఖ్యను తగ్గించుకోవచ్చని, అయితే ఇప్పటికే సగానికి సగం తగ్గి ఇతర గమ్యస్థానాల వైపు వెళ్తున్నారని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా దౌత్య అధికారుల సంఖ్యను తగ్గించినందున, కెనడాకు పరిమిత సంఖ్యలో వీసాలు జారీ చేయబడతాయనే భయం ఉంది. దీని వల్ల కెనడాలో చదువుకునేందుకు వెళ్లే విద్యార్థుల విషయంలో భారత్‌కు నష్టం వాటిల్లవచ్చు. కెనడా మంగళవారం వియన్నా సమావేశాన్ని ప్రస్తావించింది. అటువంటి పరిస్థితిలో అంతర్జాతీయ స్థాయిలో సమస్యను లేవనెత్తడానికి ప్రయత్నించవచ్చా అనేది ప్రశ్న. దీనికి సంబంధించి రాజీవ్ డోగ్రా మాట్లాడుతూ.. కెనడా స్వయంగా వియన్నా కన్వెన్షన్ నిబంధనలన్నింటినీ పక్కన పెట్టిందని చెప్పారు. ఎందుకంటే కన్వెన్షన్ ప్రకా.., దౌత్యవేత్తలకు రోగనిరోధక శక్తి ఉంటుంది. వారిని చట్టపరమైన ప్రక్రియలోకి లాగలేరు. అటువంటి పరిస్థితిలో ఈ విషయాన్ని ఏ ప్రాతిపదికన లేవనెత్తవచ్చు? అదే సమయంలో కెనడా ఇప్పటి వరకు ఎలాంటి బాధ్యతారాహిత్యాన్ని ప్రదర్శిస్తోందని, కెనడా కూడా అలాంటి విషయాలను ఆ స్థాయిలో లేవనెత్తే ఆలోచనలో ఉన్నట్లు కనిపించడం లేదని ప్రొఫెసర్ స్వరణ్ సింగ్ అంటున్నారు. కెనడా ప్రభుత్వం ఈ విషయాన్ని ఫైవ్ ఐస్, జీ-7కి తీసుకువెళుతుందని తెలిపింది.

ఈ దిశగా సోమవారం నాడు బ్రిటన్ ప్రధానితో కూడా పీఎం ట్రూడో చర్చించారు. గత ఏడాది కూడా ట్రూడో ఇదే వ్యూహంతో పనిచేసినప్పటికీ ప్రయోజనం లేదని నిపుణులు విశ్వసిస్తున్నప్పటికీ.. వచ్చే ఏడాది కెనడాలో జి-సెవెన్ సమ్మిట్ జరగనుందని, అక్కడికి ప్రత్యేక ఆహ్వానితుడిగా వెళ్లాలని భారత్ నిర్ణయించుకుంటే కెనడా ప్రతిష్టకు మేలు జరుగుతుందని స్వరణ్ సింగ్ అంటున్నారు. ఒక సమూహంగా బ్రిక్స్ యొక్క ప్రతిష్ట నిరంతరం పెరుగుతోందని.. అటువంటి పరిస్థితిలో, సవాళ్లతో చుట్టుముట్టబడిన జీ-7 భారతదేశం వంటి ఆర్థిక శక్తిని అసంతృప్తికి గురిచేయకూడదని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటివరకు కెనడా నుంచి అసంబద్ధ ప్రకటనలు వెలువడ్డాయని ప్రత్యేకించి స్వయంగా ప్రధాని నుంచి లాజిక్ లేని ఆరోపణలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

కానీ భారత్ మాత్రం నిదానంగా నిశ్శబ్ద యుద్ధం చేస్తోంది. భారత్ గత ఏడాది 41 మంది కెనడా దౌత్యవేత్తలను దేశం విడిచి వెళ్లాలని కోరగా, ఇప్పుడు ఆరుగురిని బహిష్కరించింది. అటువంటి పరిస్థితిలో భారతదేశం యొక్క విధానం చర్యకు ప్రతి చర్య అనే చందంగా సాగుతోంది. కెనడా దూకుడు భాషపై భారత్ మర్యాదపూర్వకంగా స్పందించింది. ఇలాంటి పరిస్థితుల్లో కెనడాకు అంతర్జాతీయ సమాజం మద్దతుగా నిలిచే పరిస్థితి కనిపించడం లేదు. గతసారి కూడా ఈ విషయంలో అమెరికా కెనడాతో కొంతమేరకు చర్చలు జరపగా, ఇతర దేశాలు ఓటు బ్యాంకు రాజకీయాలపై ఏమీ మాట్లాడకుండా దూరంగా ఉన్నాయి.

# అప్పుల వారసత్వానికి ఆద్యులు ఎవరు?

**(మొదటి పేజీ తరువాయి)**

అయితే, 10 నెలల కాంగ్రెస్ పాలనలో రూ.80వేల కోట్లకు పైగా అప్పులు చేసినట్టు మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. దీనికి మంత్రి సీతక్క కౌంటర్ ఇవ్వడంతో రాష్ట్ర అప్పులపై మరోసారి చర్చ జరుగుతోంది.రేవంత్ కుర్చీ ఎక్కిన రోజు నుండి తెచ్చిన మొత్తం అప్పులు 80,500 కోట్లు అని, 10 నెలల్లో ఇదో రికార్డ్ అని విమర్శించారు కేటీఆర్. అప్పు తప్పు అన్నోళ్లని ఇప్పుడు దేనితో కొట్టాలని సెటైర్లు వేశారు."ఎన్నికల హామీలేవీ తీర్చలేదు. ఏ కొత్త సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు. మరి ముఖ్యమంత్రి తెస్తున్న అప్పు ఏమైనట్టు? 80 వేల కోట్ల ధనం ఎవరి జేబులోకి వెళ్లినట్టు? బడా కాంట్రాక్టర్ల బిల్లులకే ధారాదత్తం చేస్తున్నారా? కమిషన్ల కోసం కక్కుర్తి పడే అప్పులు తెస్తున్నారా? అప్పు శుద్ధ తప్పు అని ప్రచారంలో ఊదరగొట్టి అవే అప్పుల కోసం ముఖ్యమంత్రి పాకులాడటమేంటి? బీఆర్ఎస్ హయాంలో అప్పులు తీసుకుని ప్రాజెక్టులు కట్టాం. ప్రతి పైసాతో మౌలిక సదుపాయాలు పెంచాం. తీసుకున్న రుణంతో దశాబ్దాల కష్టాలు తీర్చాం" అని అన్నారు కేటీఆర్. కానీ, రేవంత్ రెడ్డి తెస్తున్న అప్పుల అడ్రస్ ఎక్కడుందని ప్రశ్నించారు. రుణమాఫీ చేయకుండా, రైతుభరోసా వేయకుండా, కొత్త ప్రాజెక్టు కట్టకుండా, నెలలపాటు జీతాలు ఇవ్వకుండా, ఇన్ని వేలకోట్లు ఏమైనట్టు? ఎవరి జేబుల్లోకి వెళ్లినట్టు అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. సొంత ఆస్తులు పెంచుకోవడానికి అప్పులు చేయడం క్షమించరాని నేరం, తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తుకు పెను ప్రమాదం అంటూ విమర్శించారు. అప్పులపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు

మంత్రి సీతక్క. "తొమ్మిదన్నరేళ్లలో మీరు చేసిన అప్పులకు వడ్డీలు కట్టడానికి కొత్త అప్పులు చేయాల్సిన దుస్థితిని తీసుకొచ్చింది ఎవరు? అప్పుల వారసత్వానికి ఆద్యులు ఎవరు? మీ హయాంలో అక్షరాలా రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశారు. వాటికి కిస్తీలు, వడ్డీల కోసం ప్రతిరోజు టంచన్‌గా రూ.207 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. అంటే ప్రతి నెలా సగటున రూ.6 వేల కోట్ల ప్రజాధనాన్ని మీ అప్పుల కుప్పను కడగడానికే సరిపోతుంది. అప్పుల అప్పారావు లాగా అందిన కాడల్లా అప్పులు చేసి, రాష్ట్రాన్ని తిప్పలు పెట్టి, వడ్డీలతో ఆర్థిక వ్యవస్థ నడ్డి విరిచిన మిమ్మల్ని దేనితో కొట్టాలి" అంటూ కౌంటర్ ఇచ్చారు సీతక్క. అప్పులు చాలవన్నట్లు వేల కోట్ల బకాయిలను చెల్లించలేదని, చేసిన పనులకు బిల్లులు పెండింగ్‌లో పెట్టారని మండిపడ్డారు. 5 వేలకోట్ల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఆరోగ్య శ్రీ, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు, సర్పంచుల బకాయిలు, విద్యుత్ సంస్థలకు, ఆర్టీసీకి, గురుకుల భవనాల ఓనర్లకు అద్దె, ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిధుల పెండింగ్, ఇలా ప్రతి శాఖలో వందల కోట్ల బకాయిలు పెట్టి ఇప్పుడు బుకాయిస్తే ఏలా అని ప్రశ్నించారు."మీ నిర్వాకంతో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ, ఈ 10 నెలల కాలంలో 18 వేలకోట్ల పంట రుణాలను ప్రజా ప్రభుత్వం మాఫీ చేసింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళల వంటింటి భారం దించేందుకు రూ.500 కే గ్యాస్ సిలిండర్, సామాన్యులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పటికే 60 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ శాం. ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటు, ఇలా ఎన్నో ప్రతిష్టాత్మక పథకాలకు శ్రీకారం చుట్టాం. అయినా మీరు అప్పులు, బకాయిలు, హామీల గురించి నీతులు చెప్పడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లే ఉంది" అంటూ మండిపడ్డారు సీతక్క.

# 80 వేల కోట్ల అప్పు ఎక్కడికి పోయింది?

**(మొదటి పేజీ తరువాయి)**

నిర్ణయం తీసుకున్నాం. ఇక రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు.

నల్గొండకు మంచి నీళ్లు ఇచ్చే ఏర్పాట్లు మేము చేశాం. ఇక నల్గొండ కు నీళ్లు ఇచ్చే ఇష్టం లేదా అంటూ ముఖ్యమంత్రి గారు ఆరోపణలు చేయాల్సిన అవసరం లేదు. గతంలోనే మేము మూసీ సుందరీకరణ చేపట్టాలని సుధీర్ రెడ్డి ఛైర్మన్‌గా ప్రయత్నం చేశాం.

కానీ గరీబోళ్లకు అన్యాయం జరుగుతదంటే ఆ ప్రాజెక్ట్ వద్దని కేసీఆర్ చెప్పారు. మానవీయ ముఖ్యమంత్రి ఉంటే ఆ విధంగా నిర్ణయాలు ఉంటాయి.మూసీ సుందరీకరణ మేము కూడా చేశాం. కానీ ఒక్క పేదవాడి కడుపు కూడా కొట్టలేదు. మూసీ సుందరీకరణకు రూ. లక్షా 50 వేల కోట్లు ఎందుకో చెప్పాలి. 50 ఏళ్ల క్రితం పట్టాలిచ్చిన వారిని హైడ్రా పేరుతో కూల్చివేస్తామంటే కుదరదు. మీరు చేసిన తప్పునకు పేదలను బలి చేస్తారా? మీరే పట్టాలిచ్చి మీరే కూలగొడుతారా? పేదలకు ఎవరు దిక్కు లేరన్నట్లుగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తామంటే బీఆర్ఎస్ ఊరుకోదు.

హైదరాబాద్‌లోని పేదలకు బీఆర్ఎస్ రక్షణ కవచంగా ఉంటుంది. రేవంత్ రెడ్డి పంపే బుల్డోజర్లకు అడ్డుగా మా నాయకులు ఉంటారు. మేము నిర్మించిన అన్ని ఎస్టీపీలను కూడా మా ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటిస్తాం. మా ప్రభుత్వం ఉన్నప్పుడు, నాలా డెవలప్ మెంట్ కార్యక్రమం తీసుకున్నాం. దాని ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాలను కూడా సందర్శిస్తాం. హైడ్రా పేరుతో ప్రభుత్వం భయపెడుతున్న అన్ని ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రజలకు మేము భరోసా ఇస్తాం. ప్రభుత్వం చట్టాన్ని గౌరవించకపోతే మేము న్యాయపరంగా కూడా పోరాటం చేస్తాం. బీఆర్ఎస్ లీగల్ సెల్ కు దాదాపు 450 మంది వచ్చి అండగా ఉండాలని కోరారు. మా పార్టీ లీగల్ సెల్ ను మరింత బలోపేతం చేస్తాం. లీగల్ సెల్ వాళ్లు చాలా కష్టపడి పనిచేస్తున్నారు. వారికి అభినందనలు. ఈ ప్రభుత్వం చట్టానికి వ్యతిరేకంగా పనిచేస్తూ, ప్రజలను కబ్జాదారులు అంటున్న విధానాన్ని ఎండగడతాం. హైడ్రా కారణంగా భయానక వాతావారణం వచ్చింది. మొన్న హైడ్రా పేరుతో కాంగ్రెస్, ఎంఐఎం నాయకులే కొట్టుకున్నారు. ఈ ప్రభుత్వ దిక్కుమాలిన పాలన కారణంగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ మొత్తం పడిపోయింది.

మాకు అప్పు పుట్టటం లేదని మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు అంటున్నారు. మీ ముఖ్యమంత్రే దివాళా కోరు మాటలు మాట్లాడితే అప్పులు ఎలా పుడుతాయి? నిర్మాణం కాదు విధ్వంసం చేస్తామంటే ఇలాంటి పరిస్థితే ఉంటుంది. బీజేపీ నాయకుల కన్నా ఎక్కువగా రేవంత్ రెడ్డి దేశ రక్షణ గురించి మాట్లాడుతున్నాడు. ఆయన మాటలు ఆశ్చర్యంగా అనిపించాయి. దేశ రక్షణకు బీఆర్ఎస్ కట్టుబడి ఉంది. ఏ మూసీ సుందరీకరణ అంటున్నావో అదే ప్రాంతంలో 12 లక్షల చెట్లు నరికివేసి ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా ఎలా న్యాయం చేస్తారు? గంగా నది పుట్టిన గంగోత్రి వద్ద 150 కిలోమీటర్లు ఎకో సెన్సిటివ్ జోన్ అంట. మరి మూసీకి కనీసం 10 కిలోమీటర్ల ఎకో సెన్సిటివ్ జోన్ లేదా? మేమే కేబీఆర్ పార్క్ వద్ద ఫ్లై ఓవర్లు కట్టాలని అనుకున్నాం. పర్యావరణం దెబ్బతింటుందంటే ఆ ప్రతిపాదనలను విరమించుకున్నాం.

2017లో రాడార్ నిర్మాణం కోసం జీవో ఇచ్చినప్పటికీ పర్యా వరణం దెబ్బ తింటుందంటే మేము ఆ జీవో ను తొక్కి పెట్టాం. మేము జీవో ఇచ్చామని చెబుతున్నావ్. మేము చేసిన పనులన్నీ చేస్తున్నావా? రైతు బంధు, 24 గంటల కరెంట్, ఫించన్, పాలమూరు ఎత్తిపోతల మేము చేశాం. మరి నువ్వు వాటిని చేస్తున్నావా?

మేము పర్యావరణ రక్షణ కోసం పనిచేశాం కాబట్టే ఇచ్చిన జీవోలను నిలిపివేశాం. రేవంత్ రెడ్డికి ప్రధాని మోడీని ఒక్క మాట అనా లంటే దడ. అందుకే మనకు కేంద్ర బడ్జెట్‌లో అన్యాయం జరిగినప్పటికీ అసెంబ్లీలో ఒక్క మాట మాట్లాడలేదు. జనావాసాలు లేని చోట పెట్టే రాడార్ కేంద్రం,తెలంగాణలో ఎందుకు పెట్టినట్లు? మూసీని పురిట్లోనే ఆగం చేసి కింద మాత్రం మంచి చేస్తామంటే ఎవరు నమ్ముతారు? హైదరాబాద్ లో ప్రజలకు భరోసా ఇచ్చేందుకు మా నాయకులంతా కలసికట్టుగా కదులుతాం. ప్రజలకు ఏమైనా ఇబ్బంది వస్తే మా ప్రజాప్రతినిధులను కలవండి. లేదంటే తెలంగాణ భవన్‌కు రండి. మీకు న్యాయం తప్పకుండా జరుగుతుంది.

హైడ్రా, మూసీ పేరుతో సృష్టిస్తున్న భయాకన వాతావారణం నుంచి ప్రజలను రక్షించేందుకు బీఆర్ఎస్ కదులుతోంది. త్వరలోనే షెడ్యూల్ ప్రకటిస్తాం. ఈ ప్రభుత్వంలో ఒక మంత్రి మాట్లాడే మాట ఇంకొక మంత్రికి తెలియదు. వాళ్ల శాఖలకు సంబంధం లేని అంశాలపై మాట్లాడుతున్నారు.

# కేంద్ర ఉద్యోగులకు 3 శాతం డీఏ పెంపు

**(మొదటి పేజీ తరువాయి)**

సమావేశంలో నిర్ణయించారు. నివేదిక ప్రకారం.. మార్కెటింగ్ సీజన్ 2025-26 కోసం ప్రభుత్వం రబీ పంటలకు కొత్త కనీస మద్దతు ధర (MSP)ని నిర్ణయించింది. ఇందులోభాగంగా గోధుమల ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.150 పెంచి రూ.2,425కి చేరుకుంది. ఇది ఇప్పటివరకు క్వింటాల్‌కు రూ.2,275గా ఉంది. ఆవాలపై ఎంఎస్‌పీ క్వింటాల్‌కు రూ.300 పెంచి క్వింటాల్‌కు రూ.5,650 నుంచి రూ.5,950కి పెరిగింది. అదేవిధంగా, కందుల ఎంఎస్‌పిని క్వింటాల్‌కు రూ.210 పెంచాలని నిర్ణయించారు.

దాని కొత్త ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.5,650గా మారింది. ఇది గతంలో క్వింటాల్‌కు రూ.5440గా ఉంది. ఇది కాకుండా కందులుపై ఎంఎస్‌పి క్వింటాల్‌కు రూ.275 పెంచి క్వింటాల్‌కు రూ.6,425 నుంచి రూ.6,700కి పెంచారు.

కుసుమ ధర రూ.5,800 నుంచి రూ.140 పెరిగి రూ.5,940కి చేరింది.రైతులకు వారి పంటలకు ప్రభుత్వం హామీ ఇచ్చే కనీస మద్దతు ధర ఎమ్ఎస్పీ అంటారు. ప్రభుత్వం రైతుల నుంచి పంటలను కొనుగోలు చేసే ధర ఇది.

పంటల ధరల్లో హెచ్చుతగ్గుల వల్ల నష్టాల నుంచి రైతులను రక్షించడమే దీని లక్ష్యం. ఈ సందర్భంగా అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ .. రైతుల సంక్షేమం కోసం కేంద్రం కట్టుబడి ఉందన్నారు. పంజాబ్-హర్యానా సరిహద్దులో ఉన్న రైతుల గురించి కూడా ప్రస్తావించారు. రైతుల సంక్షేమానికి పూర్తి కట్టుబడి ఉన్నామని, రైతులకు మేలు చేసే అనేక నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

## హైకోర్టులోనూ ఐఏఎస్‌లకు

# చుక్కెదురు

**(మొదటి పేజీ తరువాయి)**

దాఖలు చేశారు. ఆమ్రపాలి, వాకాటి కరుణ, రోనాల్డ్ రోస్, వాణీప్రసాద్‌ల లంచ్?మోషన్ పిటిషన్‌ను అనుమతించిన కోర్టు మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణ ప్రారంభించింది. దాదాపు 2 గంటల విచారణ తర్వాత తీర్పును రిజర్వ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అంతేకాకుండా సదరు అధికారులు తమకు కేంద్రం (డిఓపీటీ) డిపార్ట్ మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఆదేశాల ప్రకారం ఆయా రాష్ట్ర ప్రభుత్వానికి వెంటనే రిపోర్ట్ చేయాలని సూచనలు ఇచ్చింది. మీ అభ్యర్థనపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ అనుకూలమైన తీర్పు ఇవ్వకపోతే కోర్టుకు రావటం సరికాదని తెలిపింది. ఒకవేళ మీ పిటీషన్ డిస్మిస్ చేస్తే మళ్లీ కోర్టుకే వస్తారని, పని చేసేందుకు ఎక్కడ అవకాశం కల్పిస్తే అక్కడకు వెళ్లి పని చేయాలని న్యాయస్థానం స్పష్టం చేసింది. వీటిపై విచారణ తర్వాత చేస్తామని తేగేసి చెప్పేసింది. ఫలితంగా తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో అఖిల భారత సర్వీస్ అధికారుల కేటాయింపులపై డీఓపీటీ ఆదేశాలకు అనుగుణంగా అలాటెడ్ రాష్ట్రాల్లో రిపోర్టు చేయాల్సిన తప్పని పరిస్థితి నెలకొంది. రొనాల్డ్‌రోస్, శివశంకర్, హరికిరణ్, ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్ డీఓపీటీ ఉత్తర్వులపై తెలంగాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.తాము ఉన్న క్యాడర్ లోనే పనిచేస్తామని, బదిలీలు లేకుండా కొనసాగించాలని కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు.

విచారించిన క్యాట్, డీఓపీటీ ఉత్తర్వులను నిలిపేసేందుకు నిరాకరించింది. దీంతో బుధవారం హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసి అత్యవసరంగా విచారించాలని కోరారు. ఫలితంగా తీర్పును రిజర్వు చేస్తూ న్యాయస్థానం ప్రత్యేక సూచనలు ఇచ్చింది. మరోవైపు కేటాయించిన రాష్ట్రాల్లో చేరేందుకు డీఓపీటీ గడువు నేటితో తీరనుంది.జస్టిస్ అభినంద్ కుమర్ శావిలి బెంచ్ పిటీషన్లను విచారించింది. కేంద్రం తరఫున న్యాయవాది వాదిస్తూ ఏ అధికారి ఎక్కడ పని చేయాలో చెప్పే అధికారం కోర్టుకు లేదన్నారు. సివిల్ సర్వీస్ అధికారులు పూర్తిగా కేంద్రం అధీనంలో పనిచేస్తారని, ఈ మేరకు కేంద్రంలోని సీనియర్ అధికారులే వీరి పోస్టింగ్లలపై నిర్ణయాలు తీసుకుంటారన్నారు. విచారణ సమయంలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అధికారులు ప్రజా సేవ కోసమే ఉన్నారని, ఎక్కడ పోస్టింగ్ ఇస్తే అక్కడే పనిచేయాలని సూచించింది.

# హైడ్రాకు మరిన్ని అధికారులు

**(మొదటి పేజీ తరువాయి)**

చట్టంలోని అధికారాలను బదిలీ చేస్తూ పురపాలకశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులపై స్పందించిన కమిషనర్ రంగనాథ్.. జీహెచ్ఎంసీ చట్ట సవరణతో హైడ్రాకు పూర్తి స్థాయి అధికారాలు వచ్చాయన్నారు. ఇకపై ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కోసం హైడ్రానే నోటీసులు జారీ చేస్తుందని స్పష్టం చేశారు. అలాగే కూల్చివేతలు, స్వాధీనం సహా తదితర అధికారాలన్నీ హైడ్రాకు లభించాయని రంగనాథ్ పేర్కొన్నారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల వల్ల హైడ్రా మరింత బలపడిందన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ చట్ట ప్రకారం, ఓఆర్ఆర్ పరిధిలోని 27 మున్సిపాలిటీలకు పురపాలక చట్టం ప్రకారం హైడ్రా నడుచుకుంటుందని తెలిపారు. తాజా ఉత్తర్వులతో రానున్న రోజుల్లో అక్రమ నిర్మాణాల పాలిట హైడ్రా మరింత దూకుడుగా వ్యవహరించ బోతున్నట్టు తెలుస్తోంది. అయితే, ఇటీవల కొన్ని నిర్మాణాల కూల్చివేతల విషయంలో కోర్టుల నుంచి యథాతథ స్థితి కొనసాగించాలన్న ఆదేశాలు ఉన్న నేపథ్యంలో కొంత ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రస్తుతం కోర్టులు స్టే ఇచ్చిన నిర్మాణాల జోలికి వెళ్లకుండా గతంలో కూల్చివేతల ఆదేశాలున్న వాటిపై హైడ్రా దృష్టి సారిస్తోంది.

## దేశవ్యాప్తంగా 9 మంది వీఐపీలకు

# ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ తొలగింపు

**(మొదటి పేజీ తరువాయి)**

మంజూరు చేసింది. ఇటీవల పార్లమెంట్ సెక్యూరిటీ విధుల నుంచి ఉపసంహరించుకోబడిన సీఆర్‌పీఎఫ్-వీఐపీ సెక్యూరిటీ వింగ్‌ని ప్రముఖుల భద్రత కోసం వినియోగించనున్నారు. ప్రస్తుతం దేశంలో ఎన్ఎస్‌జీ 'బ్లాక్ క్యాట్' కమాండోల భద్రతలో 9 మంది వీఐపీలు ఉన్నారు. వీరందరికి కూడా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)తో భద్రత కల్పిస్తారు. ఈ తరహా "జెడ్ ప్లస్" కేటగిరీలో ఉన్నవారిలో ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, యూపీ మాజీ సీఎం మరియు బీఎస్పీ అధినేత్రి మాయవతి, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీనియర్ బీజేపీ నేత ఎల్‌కే అద్వానీ, కేంద్ర షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం రమణ్ సింగ్ ఉన్నారు. జమ్ము కాశ్మీర్ మాజీ సీఎం గులాం నబీ ఆజాద్, ఎన్సీ నేత ఫరూఖ్ అబ్దుల్లా వంటి ప్రముఖులు కూడా ఈ సెక్యూరిటీ కవర్‌లో ఉన్నారు. ఆరు వీఐపీ సెక్యూరిటీ బెటాలియన్లు కలిగిన సీఆర్‌పీఎఫ్, దీని కోసం ఏడో బెటాలియన్‌ని స్వీకరించాలని కోరింది. తాజా బెటాలియన్ కొన్ని నెలల క్రితం పార్లమెంట్ రక్షణగా ఉండేది. గతేడాది పార్లమెంట్‌లో సెక్యూరిటీ ఉల్లంఘటన తర్వాత, సీఆర్‌పీఎఫ్‌ని తీసేసి పార్లమెంట్ రక్షణని సీఐఎస్‌ఎఫ్‌కి అప్పగించారు. కొత్త టాస్క్‌ని చేపట్టడం కోసం ముఖ్యమంత్రి భద్రతను ఎన్ఎస్‌జీ నుంచి సీఆర్‌పీఎఫ్‌కి మార్చడానికి ఆంధ్రప్రదేశ్ పోలీస్ టీం ఇటీవల ఢిల్లీ వెళ్లినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సమాచారం ప్రకారం.. ఈ తొమ్మిది మందిలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సీఆర్‌పీఎఫ్ చేపడుతున్న అధునాతన భద్రతా అనుసంధాన(ఏఎస్ఎల్) ప్రోటోకాల్‌ని కలిగి ఉంటారని తెలుస్తోంది. ఏఎస్ఎల్ ప్రోటోకాల్ ప్రకారం.. వీఐపీలు సందర్శించాల్సిన ప్రదేశం మొత్తం భద్రతా అధికారుల నిఘాలోకి వెళ్లిపోతుంది. ఇలాంటి ప్రోటోకాల్ కేంద్ర హోం మంత్రి అమిత్ షా, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, గాంధీ కుటుంబంలోని ముగ్గురితో సహా ఐదుగురికి ఈ ప్రోటోకాల్ ఉంది. యాంటీ టెర్రర్ ఆపరేషన్స్ నిర్వహించే ఎన్ఎస్‌జీ కమాండోలను ఇకపై పూర్తిగా టెర్రర్ ఆపరేషన్లపై దృష్టిసారించేలా చేయడం కేంద్ర ప్లాన్‌గా తెలుస్తోంది. వీరిని వీఐపీ భద్రత విధుల నుంచి తప్పించే ప్రణాళిక 2012లోనే తయారైంది. కేంద్రం ఎన్ఎస్‌జీని పునర్నిర్మాణం చేయాలని భావిస్తోంది. ఎన్ఎస్‌జి తీవ్రవాద వ్యతిరేక మరియు హైజాక్‌కి వ్యతిరేక ఆపరేషన్స్ చేయడానికి వీలు కలుగుతుంది. వీఐపీ భద్రతా నుంచి ఎన్ఎస్‌జీని విత్ డ్రా చేసిన తర్వాత 450 మంది భద్రతా బాధ్యతల నుంచి రిలీవ్ అవుతారు.



బదిలీ అయిన ఏ ఈ జుబేరుద్దీన్ నుండి పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన ఏ ఈ రవీందర్




బదిలీ అయిన ఏఈ జుబేరుద్దీన్, నూతన ఏ రవీందర్‌లను సన్మానిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

# గగన్‌పహాడ్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా రవీందర్

**రాజేంద్రనగర్, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని గగన్ పహాడ్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్గా రవీందర్ నియమితులయ్యారు. బుధవారం ఈ మేరకు ఇక్కడ ఏఈ గా పనిచేసిన జుబేరుద్దీన్ నుండి రవీందర్ పదవి బాధ్యతలు స్వీకరించారు.

ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ... విద్యుత్తు అధికారులు సిబ్బంది ఉద్యోగులు స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజలకు మెరుగైన విద్యుత్తు సేవలు అందించటానికి కృషి చేస్తానన్నారు. ఇక్కడ ఏ ఈగా పనిచేసిన జుబేరుద్దీన్ మాట్లాడుతూ... గత మూడు సంవత్సరాలుగా సంస్థలు పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సహకారంతో విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించామన్నారు. ఈ సందర్భంగా బదిలీ అయిన జుబేరుద్దీన్, నూతన ఏఈ రవీందర్ ను శాలువాతో శంషాబాద్ ఏఈ షేక్ బాషా, విద్యుత్ ఉద్యోగుల సంఘం 1104 యూనియన్ ప్రధాన కార్యదర్శి అజీమ్, ఉద్యోగులు సిబ్బంది సన్మానించారు.



గగన్ పహాడ్ విద్యుత్ ఏఈగా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న రవీందర్



బదిలీ అయిన డి ఈ రామచంద్రయ్యను సన్మానిస్తున్న ఎస్ ఈ శ్రీరామ్మోహన్

# సిద్దిపేట్ విద్యుత్ డివిజన్ డి.ఇ.గా కె.రామచంద్రయ్య

**సిద్దిపేట, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** సిద్దిపేట విద్యుత్ డివిజన్ డివిజనల్ ఇంజనీర్ గా కె రామచంద్రయ్య బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. సిద్దిపేట డివిజన్ డిఈగా పదవి బాధ్యతలు స్వీకరించిన రామచంద్రయ్యను అధికారులు సిబ్బంది ఉద్యోగులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇక్కడ డిఈగా పనిచేసిన జి మహేష్ కుమార్ సాధారణ బదిలీలలో భాగంగా హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. బుధవారం ఉదయం రాజేంద్రనగర్ సర్కిల్ విద్యుత్ డిఈ (టెక్నికల్)గా పనిచేసి బదిలీ అయిన రామ చంద్రయ్యను సర్కిల్ ఎస్ఇ శ్రీరామ్ మోహన్, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ... సిద్దిపేట డివిజన్లో విద్యుత్ సమస్యలు లేకుండా బాధ్యతాయుతంగా పనిచేస్తానన్నారు.





సిద్దిపేటలో పదవి బాధ్యతలు స్వీకరించిన డిఈ రామచంద్రయ్య సన్మానిస్తున్న అధికారులు, ఉద్యోగులు



# పేకాట స్థావరంపై ఎస్‌బి పోలీసుల దాడి

**రెండు లక్షల నగదు స్వాధీనం**

**జమ్మిచేడు దగ్గర ఒక లాడ్జిలో ఆడుతున్న పేకాట స్థావరంపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడి**

**పేకాట రాయల్ల నుండి దాడి 2 లక్షల790 రూపాయల నగదు, 6 బైక్‌లు స్వాధీనం**

**12 మంది అరెస్ట్, ఒకరు పరార్**

**గద్వాల్, అక్టోబర్ 16 (నమస్తే ఉదయం):** గద్వాల్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జమ్మిచేడు జమ్ములమ్మ దగ్గర గల ఎస్‌వీఆర్ లాడ్జిలో పేకాట శిబిరంపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు దాడి చేశారు. గద్వాల్ రూరల్ పోలీసులు విశ్వసనీయకు సమచారం రాగ జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు బుధవారం గద్వాల్ రూరల్ ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది సంయుక్తంగా పేకాట స్థావరం పై దాడి నిర్వహించి 12 మందిని అరెస్టు చేయగా ఒకరు పరారీ అయ్యారు. వారి నుండి రూ.2 లక్షల790 నగదు, 6 బైక్‌లు, 13 మొబైల్స్ ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై తెలిపారు. కేసు నమోదు అయిన వారిలోవేముల గ్రామానికి చెందిన దండు రాజు - వేముల, గొల్ల గోవిందు బీరొల్లుకు చెందిన నంబి గోపీనాథ్, గౌని యుగంధర్ రెడ్డి, ధర్మవరం గ్రామానికి చెందిన బాగి రెడ్డి గోపాల్ రెడ్డి, నారాయణపురం గొల్ల సురేష్, నరేష్ రెడ్డి నారాయణపురం, పెద్దపల్లి ఉప్పరి నాగరాజు, తుమ్మలచెర్వు బలిజ రాజశేఖర్, పూదూరు బోయ ఈశ్వర్, పెద్దదిన్నె గొల్ల వెంకటేష్, గద్వాల్ కు చెందిన కౌకుంట్ల చంద్ర మోహన్, మోహన్‌లు ఉన్నారు.



# గద్వాల్‌లో అదనపు సివిల్ కోర్ట్‌కై విజ్ఞప్తి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్న కేసుల సంఖ్య దృష్ట్యా రెండవ అదనపు జూనియర్ సివిల్ కోర్టు మంజూరు చేయాలని గద్వాల బార్ అసోసియేషన్ హైకోర్టు పోర్టు ఫోలియో న్యాయమూర్తి గౌ పుల్లా కార్తిక్ ను కోరింది.బుధవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్ రఘురాం రెడ్డి ఆధ్వర్యంలోని న్యాయవాదుల బృందం పోర్ట్ఫోలియో జడ్జ్ ను కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఆలాగే ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డితో పాటు హెూం శాఖ జిపి మహేష్ ఝురకీలను మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యులు కొండారెడ్డితో పాటు సీనియర్ న్యాయవాదులు వినోదాచారి, విజయ్ మోహన్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ఆనంద్ రావు, నరసింహులు, మహేష్, సురేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కండేయ నగర్‌లో తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటన

**రాజేంద్రనగర్, అక్టోబరు16(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయ నగర్ లో రూ. 40 లక్షలు రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లు పనులను రాజేంద్ర నగర్ నియోజక వర్గ కాంటెస్టడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి బుధవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. గురువారం నుంచీ పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. బస్తీలో అవసరం ఉన్న చోట రోడ్ వేస్తారని తెలిపారు. డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ఎక్కడ కూడా నాణ్యత లోపాలు లేకుండా చూడాలని అధికారులను కోరారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని ఆయన అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులలో నాణ్యత లోపాలు ఉంటే సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్స్పెక్టర్ రాహుల్, వి. రమేష్ చందు సూర్య నారాయణ చింటూ రెడ్డి,కృష్ణ, లచ్మన, పాండు భాస్కర్ ,ధనుంజయ్ సురేష్, శామ్,జంగిర్ పందురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మార్కండేయ నగర్ బస్తీలో పర్యటిస్తున్న కార్పోరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



# మహర్షి వాల్మీకీ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

**గద్వాల(కేటిదొడ్డి), అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం కేటీదొడ్డి ఎంపీడీవో మరియు తహసీల్దార్ కార్యాలయాలకు వాల్మీకి సంఘం గద్వాల తాలూకా అధ్యక్షుడు ఆంజనేయులు, మండలం వాల్మీకి అధ్యక్షుడు టీచర్ గోవిందు ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి చిత్రపటాన్ని ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ధరూర్ మండల అధ్యక్షులు సురేష్, తాలూకా సేవా సంఘం కమిటీ సభ్యులు సురేష్ ఉప్పేర్ నాగరాజు వేణు, రవి, తదితరులు పాల్గొన్నారు.

# విధినిర్వణలో ఉద్యోగులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

**- ఇబ్రహీం బాగ్ విద్యుత్ డి ఈ రమేష్ చంద్ర**

**గండిపేట, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** విధి నిర్వహణలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజన్ డి ఈ ఎం రమేష్ చంద్ర సూచించారు. బుధవారం ఇబ్రహీంబాగ్ డివిజనల్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.రమేష్ చంద్రని మర్యాద పూర్వకంగా విద్యుత్ 327 యూనియన్ ఆధ్వర్యంలో శాలువాతో ఆయన సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. డి ఈ రమేష్ చంద్రను సన్మానించిన వారిలో యూనియన్ డివిజన్ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ., డివిజన్ సెక్రెటరీ విజయ్ కుమార్, డివిజన్ ట్రెజరర్ మహేష్ యాదవ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామరాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేష్, యూనియన్ సభ్యులు శివప్రసాద్, ఇతర సభ్యులు ఉన్నారు.



ఇబ్రహీంభాగ్ విద్యుత్ డిఈ రమేష్ చంద్రను సన్మానిస్తున్న ఉద్యోగ 327 సంఘం ప్రతినిధులు

# విధులోకి చేరిన నూతన ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** ధరూర్ మండలంలోని మార్లబీడు గ్రామానికి చెందిన ఎ.నరేష్ ఇటీవల విడుదలైన డీఎస్సీలో పీఈటీ ఉపాధ్యాయ ఉద్యోగం పొంది బుధవారం గద్వాలలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్లో పీఈటీగా విధులోకి చేరాడు. ఈ సందర్భంగా టియు డబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ప్రముఖ సామాజికవేత చుక్క సుదర్శన్ రెడ్డి ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయుడు ఎ.నరేష్ ను శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ భవిష్యత్తు ఉపాధ్యాయుల పైనే ఆధారపడి ఉందని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని కోరారు.



విధుల్లో చేరిన క్రీడ ఉపాధ్యాయుడు నరేష్ సన్మానిస్తున్న టీయూడబ్ల్యూజే నాయకులు

# బాబుల్ రెడ్డి నగర్‌లో విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

**- మాజీ కాన్సిలర్ ఎస్ వెంకటేష్**

**రాజేంద్రనగర్, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబు రెడ్డిని నగర్‌లో గల విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని బుధవారం శాస్త్రిపురం విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్ ను కలిసి మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ వినతి పత్రం అందజేశారు. బాబు రెడ్డి నగర్ బస్తీలో రోజురోజుకు జనాభా పెరగడం వల్ల ప్రస్తుతం ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల సామర్థ్యం సరిపోకపోవడంతో తరచుగా విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని, కొన్ని ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని వెనుక పత్రంలో పేర్కొన్నారు. గత 30 ఏళ్లుకు ముందు వేసిన స్తంభాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయని, వాటి స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా రోడ్డు మధ్యలో స్తంభాలు ఉండటంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఏఈకి వివరించారు. రావడానికి పోవడానికి ఇబ్బందికరంగా మారడంతో ఆ స్థంబాలని రోడ్డు మధ్యలో నుంచి ఒక వైపుకు మార్చాలని కోరారు. అందుకు ఏఈ సుధాకర్ సానుకూలంగా స్పందించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో బిఆర్ఎస్ నాయకులు రాయుడు, సింహాద్రి, రాజ్ కుమార్ ,రిషి ,ప్రవీణ్ ,సన్నీ, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఏఈ సుధాకర్‌కు సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్





అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న ఏఈ దుర్గా ప్రసాద్, దుర్గాప్రసాద్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఏ డి ఈ సత్యనారాయణ

## రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరుగా దుర్గాప్రసాద్

**రాజేంద్రనగర్, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ విద్యుత్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్గా ఎం దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు టీజీఎస్పీ డీసీఎల్ సిఎండి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం రాజేంద్రనగర్ ఫిష్ బిల్డింగ్ వద్ద గల కార్యాలయంలో ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. దుర్గా ప్రసాద్ సంస్థలో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందారు. ఇంతకు ముందు ఇబ్రహీంబాగ్ విద్యుత్ డివిజన్ కార్యాలయంలో పనిచేశారు.

పదవి బాధ్యతలు స్వీకరించిన దుర్గాప్రసాద్‌కు ఇబ్బంది ఉద్యోగులు అందజేసే శుభాకాంక్షలు తెలిపారు.



ఏ ఈ దుర్గాప్రసాద్ సన్మానిస్తున్న ఇబ్రహీంబాద్ సిఎస్ సి పూర్వపు ఐ డి ఈ సాయినాథ్





కందుకూరు విద్యుత్ డివిజన్ పదవి బాధ్యతలు స్వీకరించిన గోపాలకృష్ణను సన్మానిస్తున్న కాంట్రాక్టర్లు

## కందుకూరు విద్యుత్ డివిజన్ డిఈగా గోపాలకృష్ణ

**మహేశ్వరం, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** మహేశ్వరం విద్యుత్ డివిజన్ డిఇగా గోపాలకృష్ణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం కందుకూరులోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఆయన పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యో గులు, సిబ్బంది కాంట్రాక్టర్లు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియ జేశారు. బదిలీపై వచ్చిన వచ్చి పదవి బాధ్యతలు స్వీకరించిన ఏ డి ఈ శంకరు కాంట్రాక్టర్లు వాసుదేవరెడ్డి, ఆసిఫ్, ఉద్యో గులు సన్మానించారు.



ఏడీఈ శంకర్‌ను సన్మానిస్తున్న కాంట్రాక్టర్లు



## విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులు విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలి:కలెక్టర్ సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16 (నమస్తే ఉదయం):** నూతనంగా విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులు విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్ సూచించారు. బుధవారం గద్వాల జిల్లాలో డి.ఎస్.సి-2024 ద్వారా కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులకు కౌన్సి లింగ్ అనంతరం నియామక పత్రాలను జిల్లా కలెక్టర్ బి. యం. సంతోష్ అందజేశారు.

కలెక్టర్ ఛాంబర్‌లో డి.ఎస్.సి-2024లో కొత్తగా నియమితులైన స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలకు నియామక పత్రాలు కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నియమితులైన ఉపాధ్యాయులు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించాలన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగారావు, జెడ్పి సిఈఓ కాంతమ్మ ,విద్యా శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**అభ్యర్థులకు ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేత**






## ఐద్వా తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభను జయప్రదం చేయండి

### -ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ నర్మద

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** అక్టోబర్ 21,22,23 తేదీలలో భద్రాద్రి కొత్తగూడెం జిలాలో జరిగే ఐద్వా రాష్ట్ర 4 వ మహా సభలను జయప్రదం చేయండని ఐద్వా జిల్లా కార్యదర్శి ఏ నర్మద పిలుపునిచ్చారు. బుధవారం గద్వాల జిల్లా కేంద్రం లో మహా సభల పోస్టర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్య దర్శి ఏ నర్మద మాట్లాడుతూ... మహిళ హక్కుల సాధన కోసం, మహిళ రక్షణ కోసం ఎన్నో పోరాటాలు చేస్తు తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద సంఘంగా ముందుకు సాగుతుమహిళ అభ్యనతి కోసం కృషి చేస్తున్నా మన్నారు. అక్టోబర్ 21,22,23 మూడురోజులు పాటు కొత్త గూడెం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా లో ఐద్వా రాష్ట్ర 4 వ మహా సభలు ను జరుగుతున్నాయి. 21వ తేది రోజు ప్రదర్శన బహిరంగ సభ ఉంటుం దన్నారు. మాజీ రాజ్యసభ సభ్యురాలు బృందాకారత్ మాజీ ముఖ్య అతిధిగా రానున్నారని ఆమె పేర్కొన్నారు. జిల్లా లో మహిళలు అందరు తరలి వచ్చి రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రత్నమ్మ, జయలక్ష్మి, ఐద్వా నాయ కులు దివ్య, దేవిక, సరోజ, వెంకటేశ్వరి, అక్షిత తదితరులు పాల్గొన్నారు.

## దేశ హితం కోసం పని చేసే పార్టీ బిజెపి

### రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా సభ్యత్వ నమోదు

### బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

### ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్

**రాజేంద్రనగర్,అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** క్షేత్ర స్థాయిలో బీజేపీని బలోపేతం చేసే బాధ్యత కార్యకర్తలపై ఉందని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ పిలుపునిచ్చారు.బుధవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్ పహాడ్ బస్తీలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని సభ్యత్వం చేయించారు. ఈ సందర్భంగావై శ్రీధర్ మాట్లాడుతూ...

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. పార్టీని బలోపేతం చేస్తేనే రాబోయే ఎన్నికల్లో పూర్తి స్థాయిలో మెజార్టీ సీట్లు సాధించుకునే అవకాశా లున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీయేనని చెప్పారు. రాష్ట్రంలో అధికారంలోకి తీసుకువచ్చేలా బిజెపి సభ్యత్వ నమోదు ప్రక్రియను రెండు విడతలుగా చేపడతామన్నారు.పోలింగ్ బూత్ కార్యకర్త వరకు ప్రతి ఒక్కరూ మరోసారి సభ్యత్వం తీసుకోవాలని సూచిం చారు. తెలంగాణలో వ్యక్తులకోసం కాకుండా..స్వచ్ఛమైన నీతివంతమైన పాలన సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ ఉన్నారు. ప్రపంచ చిత్ర పటం మీద భారతదేశ ఔన్నత్యాన్ని సగౌరవంగా నిలబెట్టిన బిడ్డ ప్రధాని నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో ఇంకా అనేక మంది చేరికలతో బిజెపి పటిష్టంగా తయారు కాబోతుంది జోస్యం చెప్పారు.పార్టీ ఎదుగుదల కోసం సమిష్టిగా కృషి చేయాలన్నారు.బీజేపీ లక్ష్యం పెట్టుకున్న 50 లక్షల సభ్యత్వం కావాలంటే ప్రతి ఇంటికి వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోగి రవి,వి.శ్రీనివాస్,శీలం తిరుపతిరెడ్డి,కొమురయ్య, సూరెడ్డి వినయ్ రెడ్డి, ఆడకే మహేందర్, ఎ.రాజు,రామారావు,రాములు యాదవ్,చరణ్, రాఘవేంద్ర రెడ్డి, వినయ్, బాబుజీ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ సభ్యత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న బిజెపి సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి

## హిందూ దేవుళ్లపై దాడులు చేస్తే సహించం

### - బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్ర రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 16(నమస్తే ఉదయం):** సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ధ్వంసం ఘటనపై బుధవారం గద్వాల పట్టణంలోని డికె.బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ..హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవరిస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదని, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్ద పనితీరు వల్లే తెలంగాణలో హిందూ ఆలయాలు, దేవుళ్లపై వరుసగా దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. సికింద్రాబాద్‌లో హిందూ దేవాలయాలపై వరుసగా దాడుల వెనుక కుట్రకోణం దాగిఉందని ఆరోపించారు. రాష్ట్రంలో హిందువు దేవాలయాలపై దాడులు పెరగడానికి కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి మతవిద్వేశ కార్యకాలాపాలపై ప్రభుత్వం తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హిందూ దేవాలయాలపై, విగ్రహాలపై దాడిని పోలీసుల చూసి చూడనట్లు పోవడం సరికాదు అని, మహా నగరంలో హిందూ పండుగలకు పెరుగుతున్న ఆదరణ చూడలేక దుర్మార్గులు ఇంత దుస్సాహసం చేశారని, నవరాత్రులలో డిజే పై ఆంక్షలు విధిస్తున్నా, అమ్మవారి విగ్రహాలు ధ్వంసం చేస్తున్నా, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అని ఈ ఘటనకు పాల్పడిన వారు ఎంతటి వారైనా అరెస్టు చేయాలి అని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, అసెంబ్లీ పోటీ చేసిన అభ్యర్థి బలిగేర శివారెడ్డి, అసెంబ్లీ కో కన్వీనర్ రామాం జనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట రాములు,జిల్లా ఓబీసీ మోర్చ అధ్యక్షుడు దేవా దాస్, కౌన్సిలర్ కుమ్మరి శ్రీను, బిజెపి సీనియర్ నాయకులు డబ్బిలేటి నరసింహ, గాంజా సాయి, మెహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్ర రెడ్డి


**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. “RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733